'నీవు మా పాత విద్యార్థివి. ఆమాత్రం నాకు తెలియదంటావా?'

'అబ్బే! అలా నే ననుకుంటానా సార్! ప్రయత్నాలన్నీ ఫెయిలయ్యాయి. రిజల్ట్సు చూచుకోవడంతోటే యెన్నో కలలుగన్నాను. అన్నీ పగటి కలలయ్యాయి. ఇక ఆశలన్నీ మన కాలేజీమీదనే పెట్టుకవచ్చా. ఇదీ యిలా గయింది. ఇక గత్యంతర మేముంది సార్?

'అబ్బెబ్బె! అలా డిగ్రేడైపోతావేం బాబురావ్. ఈ సంవత్సరం కాకపోతే మరు సంవత్సరం! రోజులన్నీ యిలాగే వుంటాయా? ఒచ్చే సంవత్సరం నీకే ఫస్టు ప్రిఫరెన్సు. మరేమీ అనుకోకేం!'

* * *

'మీరేం చదివారండీ?' చుట్టపొగ వత్తుగా వదుల్తూ, రెండు కాళ్లూ టేబిల్‌పై పారేసి నిర్లక్ష్యంగా అడిగాడు జిల్లాబోర్డు ప్రెసిడెంటు మల్లయ్యగారు.

'బి. యస్ సీ. ఆనర్సు; కెమిస్ట్రీ, ఫస్టు క్లాస్ సార్.' ముకుళించుకున్న హస్తాలు, చెరిగివున్న క్రాపు, మాసిన బట్టల్తో వయభయాల్ని ప్రదర్శిస్తూ బాబూరావ్ అన్నాడు.

'బి. యి డి. ప్యాసైనావా?'

'బి. యస్ సీ. ఆనర్సండీ. ఫస్టు క్లాసులో'

'ఆదేమిటయ్యా! అడిగిందానికి జవాబు చెప్పమంటే—' గద్దించి పలికారు ప్రెసిడెంటుగారు, ప్రక్కన యిసుక బోసిన మూకుట్లోకి తుబుక్కున లవ్వెడు వుమ్మి పారేస్తూ—

'దాంతో పనిలేదండీ,- ఆనర్సు పాసైతే'

'మళ్లీ అదేమాటంటావ్? నీకు......'

'లేదండీ - చదవలేదు.'

'అలా చెప్పు, అయితే సెకండరీ ట్రైనింగు ప్యాసైనావా?'

బాబూరావ్ మాటాడలేదు,......

'హయ్యర్ గ్రేడైనా ప్యాసైనావా?'

బాబూరావ్‌కు తల తిరిగిపోయింది. నోటి నుండి మాట పెగిల్తే ఒట్టు.

'సరే! ఏ కోర్సూ చదవకుండానే వుద్యోగం యెవడిస్తాడని వచ్చావయ్యా పెద్దమనిషీ. పోయి ట్రైనింగు చదువుకో—పో!'

* * *

'నిజానికి మా కాలేజీలో వేకన్సీ లేదు. కాని మీ స్థితి చూస్తే జాలేస్తుంది. యాభై రూపాయలిస్తాను వుండగలరా?' అన్నాడు ట్యుటోరియల్ కాలేజీ ప్రిన్సిపాలు.

'సరే, తప్పేదేముంది. అదే పదివేలు' శూన్యంగా చూస్తూ అన్నాడు బాబూరావ్.

'ఆల్‌రైట్, రేపట్నుంచే డ్యూటీలో చేరండి. తర్వాత టైంటేబిల్ పంపిస్తాను.'

'థాంక్యూ సార్.'

# కథావశిష్టులు

యం. హీరాలాల్ రాయ్

మే నెల. మండిపోయే యెండలు. కాళ్ళకు మంచుకట్టుకుని, తలమీద మంచు పెట్టుకుని తిరగాలనిపిస్తుంది. అందమైన మంచు తుపానులు లేచి, వూరు సాంతం ముంచేస్తే ఎంత బావుండును! హిమాచల పర్వతానికి దగ్గరగా ఈఊరిని జరుపుకుని, చల్లనిఆకాశగంగ ఊరిమీద దూకేట్టు ఏర్పాటు చేసుకుంటే ఎంతబావుండేది?

మధ్యాహ్నం చెరుగుతూన్న నిప్పుల్లో సైకిల్‌మీద ఆటువచ్చాను. విధిలేనివాళ్లే రోడ్ల మీద నడుస్తున్నారు. ఏ కాస్త వీలువున్నా ఇళ్ళల్లోంచి కదల్రు జనం. తీవ్రమైన వేండ్రంలో కుక్కలు వగరుస్తూ చావ సిద్ధమవుతూన్నై. తప్పనిసరిగా పనిమీద బయలుదేరాను.

పెద్దరోడ్డుదాటి గొంది తిరిగేప్పటికి పది కుటుంబాలు, సింధు రాష్ట్రం నుంచి వచ్చిన కాందిశీకులు, ఇళ్ళముందరి గద్దెలమీద చిరిగి మాసిన గుడ్డలు అడ్డంకట్టుకొని, కాపురాలు నడుపుకుంటూన్నారు. మావూరికి చాలామంది

సింధీలు కుటుంబాలతో వచ్చారు. సమస్తం కోల్పోయి వచ్చారు. అసలు అక్కడ కూడా ఏమీలేని పేదహిందువులూ వచ్చారు. చేతుల్లో చిల్లిగవ్వ లేదు. భార్యాబిడ్డల్ని సాకాలి. ఉంటానికి ఇల్లు దొరకదు. ఎండలు; తీవ్రమైన యెండలు. నీరసించిన శరీరాలు. జబ్బులు. పని చేసే శక్తిలేదు. చేయందీ తప్పదు.

వారివెంట మా వూరి రౌడీ వెధవలు కొందరు పడ్డారు. కాస్త పనికొచ్చే ఆడది కనపడితే దాన్ని నానాగొడవా చేయటం ప్రారంభించారు. మగాళ్ళు చూచీ చూడనట్టు ఊరుకున్నారు. నలుగురు ఆడాళ్లు మాత్రం కాస్త చీరెలు మార్చుకుని, తలదువ్వుకుని లేనినవ్వు తెచ్చుకుని గద్దెలమీద కూర్చున్నారు. వాళ్లకి మావూరి క్షుద్రవెధవలు వాసననూనె సీసాలు, చవకబారు వాసలిన్, ఫేస్‌పౌడరు డబ్బీలు తెచ్చియిచ్చారు. అంతయెండల్లో, ఆ మధ్యాహ్నంపూట, వేండ్రానికి తపించి, నూనె కారుతూన్న మొహాలమీద పౌడర్లూ స్నోలూ ఏంబాగు...? వాళ్ళనుచూడగానే నాకు ఎక్కడలేని వికారం వేసింది. విచారం, అసహ్యం కలిసి కట్టుగా మనస్సుని గల్లంతు చేశాయి. వాళ్లు నా వైపు చూసి నవ్వారు. కాలుతూన్న టిన్ రేకుల నీడలో సైకిల్ ఆపి మొహం తుడుచుకున్నాను రుమాలుతో. వాళ్ళల్లో ఒక్కత్తె మొహంమీది మచ్చల్ని చేత్తో తడుముకుంటూ నన్ను వెక్కిరించింది. మరొక్కతె గబగబా నాదగ్గరకి వచ్చి, 'నీకు హిందూస్థానీ వచ్చా?' అంది. 'నేను హిందుస్తాన్‌వాణ్ణి, నాకు రాక రాకపోవడమేమిటి?' అన్నాను. 'అయితే ఈ తెరచాటుకి రారాదూ?' అంది. 'ఎందుకూ?' అన్నాను. హిందుస్థానీలో 'నేను చెప్పాలా?' అంది. 'చెప్పందీ ఎలా తెలుస్తుంది?' అన్నాను. నవ్వింది. 'డబ్బులు కావాలి' అంది. 'లేవుగాని, ఉంటే బయటే ఇద్దును' అన్నాను. 'నీ గడియారం ఇయ్యి' అంది. తెరలో ఏడుపు వినపడ్డది. ఎవత్తో ఏడిచి ఏడిచి విసిగి సొక్కిపోయి మళ్ళీ వెక్కివెక్కి ఏడుపు మొదలుపెట్టినట్టుంది.

'ఏడుస్తున్నదెవరు?' అని అడిగాను.

'దానిబిడ్డపోయాడు,'అందితన కేమీపట్టనట్టు.

'వాళ్లెవళ్లు?' - 'మావాళ్లే.'

'అదేమిటీ, మరి అలా మెల్లగా లక్ష్యంలేనట్టు మాట్లాడతావ్? ఏమయింది?' అన్నాను.

'నిమోనియా వచ్చింది. చచ్చాడు. శవం అదేం?' అంది ఆవిడ.

తెరచాటున శవం. పసివాడు పాపం!పక్కనే ఏడుస్తూ అందమైన స్త్రీ కళ్లు వాచి, బుగ్గలు నూనెదేరి, జుత్తు మొహాన ఆడుతూ, పాపం అదోలావుంది ఆవిడ.

'మందు ఇప్పించలా?' అన్నాను.

'పైసా నహీఁ' అంది.

'అయ్యో ఇప్పుడేం చేతామని?' అన్నాను.

'పాతేయాలి డబ్బు లేదు' అంది

'రామ, రామ!' అని జేబు తడుముకున్నాను. నా దగ్గర దమ్మిడీ లేదు. నా గతీ ఇంచుమించు వాళ్ళమాదిరే వుంది. కాందిశీకుణ్ణి కాదేమోగాని దారిద్ర్యంలో వాళ్ళకు తీసిపోను.

'గవర్నమెంటు ఏమీ యివ్వదూ?' అన్నాను

'మాకు గవర్నమెంటు లేదు. తురకలకు పాకిస్థాన్. హిందువులకు హిందూస్థాన్. పేదలకు స్మశానం. మరేమీలేదు. మాకో స్థానంలేదు. ప్రాణం పోదు. మేం హిందూలం కాము. పేదలం. అందుకే రెండు దేశాల్లో మాకు చోటు లేదు. మా స్థానం స్మశానం. స్మశానంలో కూడా హాయిగా కాలిపోవడానికి కర్రలు లేవు. గుంత తవ్వుకోడానికి గునపం లేదు.'

'నిజం మీరు చెపుతోంది' అన్నాను నేను. నా గడియారం వాళ్ళమీద విసిరేసి వెళ్లొచ్చాను.

వెళ్లొచ్చినప్పటినుంచీ పదిమాట్లు కక్కుకున్నాను. ఊపిరి నడకలో మార్పు వచ్చింది. వెక్కిళ్లు, డొక్క నొప్పి, గుండెలో బరువు డాక్టర్ను పిల్చి అడిగితే 'నిమోనియా' అన్నాడు. భయం వేసింది. మందులకోసం డబ్బు లేదు. గడియారం అమ్ముకుందాం అంటే అదీ లేదు.

నేను హిందూస్థాన్‌కి నిజమైన బిడ్డను. పాకిస్థాన్‌ను ఎదిరించగల భటుణ్ణి. నాకు తిండిలేదు, మందూలేదు. సింధు స్త్రీల శరీరాలమీద కప్పుకోవటానికి గుడ్డలేదు. వాళ్ల వక్షస్థలాలు, చింపి రైకెల్లోంచి భారతమాత దౌర్భాగ్యాలూ కనపడుతూన్నాయి. వాళ్ళ పిల్లల శవాల్ని పాతడానికి పైసా లేదు. ఇటు నేనూ నా గతీ.